ఆదివారం । 15 । జనవరి । 2023

న్యూస్‌రీల్

'కంటి వెలుగు' ప్రారంభానికి మంత్రికి ఆహ్వానం



మంత్రికి మొక్క అందిస్తున్నడీఎంహెచ్‌వో

నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 18 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభోత్సవానికి రావాలని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి డీఎంహెచ్‌వో శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆహ్వానపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, కార్యక్రమ నిర్వహణ అధికారి శ్రీనివాస్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి రవీందర్ పాల్గొన్నారు.

నానూ మహరాజ్ ఆలయ అభివృద్ధికి కృషి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

సారంగపూర్: బండ్రేవు తండాలోని నానూ మహారాజ్, జగదాంబాదేవి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర దేవాదాయ, న్యాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నానూమహారాజ్ జాతరను శనివారం ఆయన సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి దర్శనం అనంతరం సన్మానించారు. ఈసందర్భంగా కబడ్డీ పోటీలను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఆలయం పునర్నిర్మాణానికి రూ.28 లక్షల నిధులు మంజూరు చేయించి త్వరలోనే టెండర్లు ఆహ్వానిస్తామని తెలిపారు. ఆలయానికి వచ్చే ప్రధాన రహదారి మరమ్మతుల నిమిత్తం 3.50 లక్షలు ఖర్చు చేస్తామన్నారు. నానూ మహారాజ్, జగదాంబదేవి ఆలయాలకు స్థలం కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ అధ్యక్షురాలు ఆశ్రితరెడ్డి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు దత్తూరాం, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ మాధవరావు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తపస్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ కిరణ్‌ఖారె

భైంసాటౌన్: తపస్(తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) క్యాలెండర్, డైరీని ఏఎస్పీ కిరణ్‌ఖారె శనివారం ఆవిష్కరించారు. సంఘం సభ్యులు పట్టణంలోని ఏఎస్పీ కార్యాలయంలో కిరణ్‌ఖారెను కలిసి డైరీ అందించి ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్, నాయకులు జి.రాజేశ్వర్, సాయన్న, భూమన్న, ఆర్.రాజేశ్వర్, ప్రసాద్‌గౌడ్, రోహిత్ పాల్గొన్నారు.

కేవా ప్రతిభ అవార్డుల ప్రదానం



అవార్డులు పొందిన వారితో సంఘ నాయకులు

లక్ష్మణచాంద: వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన కుమ్మరులకు కుమ్మర ఉద్యోగుల సంక్షేమ సంఘం నిర్మల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కేవా ప్రతిభ అవార్డులు ప్రదానం చేశారు. సోన్ మండలం కడ్తాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో సామాజిక, విద్య, ఉద్యోగ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని అవార్డుతో సన్మానించారు. ఉత్తమ ఉద్యోగులుగా ఆమెడ సాయన్న, కొత్తపల్లి శంకర్, ఉత్తమ ఉపాధ్యాయులుగా మధు సిలారి, తోడిశెట్టి భూమన్న, తోడిశెట్టి శంకర్, ఆర్టీసీ కండక్టర్ లింగయ్య, చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఎనగందుల అంకిత, మారుపాక సాయిచంద్రకుమార్, మారుపాక జయంత్‌కుమార్, సిలివేరి రుత్విక, కొత్తపల్లి సుజ్ఞాన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కొత్తపల్లి బుచ్చన్న, కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి గంగాధర్, నాయకులు రవీందర్, సాయన్న, అశోక్‌కుమార్, రవికాంత్, మధు, పరమేశ్వర్, చంద్రయ్య, ముత్యం, నార్లపురం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.









సంబురంగా భోగి

సంక్రాంతి మూడు రోజుల పండుగ. శనివారం భోగితో సంబురాలు మొదలయ్యాయి. వేకువజామునే మహిళలు ముంగిళ్లను రంగవల్లులతో అలంకరించారు. గొబ్బెమ్మలు ఉంచి పూజలు చేశారు. తర్వాత కూడళ్లలో భోగి మంటలు వేశారు. చెడు దహనమై పోవాలని పూజలు చేశారు. డీజే పాటలకు భోగి మంటల చుట్టూ యువతులు స్టెప్పులు వేశారు. గంగిరెద్దులు, హరిదాసులు, పతంగుల, పిండివంటల తయారీతో కోలాహలం ప్రారంభమైంది. చిన్నారులకు భోగిపండ్లు పోశారు. చిన్నపెద్ద తేడా లేకుండా గాలిపటాలు ఎగురవేస్తున్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్, నిర్మల్







సంక్రాంతి

- వెలుగును పెంచే సూర్యుడు..
- ఉత్తరాయణ పుణ్యకాలం ఆరంభం
- ముంగిళ్లలో రంగుల హరివిల్లు..
- పతంగులతో చిన్నారుల సందడి
- పండుగకు ఆంధ్రకు వెళ్లిన యువకులు

నిర్మల్: రంగుల ముగ్గులు, మధ్యలో గొబ్బెమ్మలతో వీధులన్నీ స్వాగతం పలుకుతుండగా, నోములతో పూజలు చేస్తూ, చిన్నపెద్ద తేడా లేకుండా పతంగులతో సందడి చేస్తుండగా రానే వచ్చింది సంక్రాంతి. వస్తూవస్తూ కొత్త కాంతిని తీసుకువచ్చింది. ప్రకృతితో ముడిపడిన మన పండుగల్లో మకర సంక్రాంతి ప్రత్యేకమైనది. హేమంత రుతువులో మార్గశిర మాసపు శీతగాలులు, మంచు కురిసే ఈ వేళలో సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశిస్తాడు. ప్రభాకరుడు ఇక నుంచి తన వెలుగును, వేడిని పెంచుతూ పోతాడు. జిల్లావ్యాప్తంగా శనివారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. సంక్రాంతి పర్వదినాన్ని ఆదివారం ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. చాలామంది యువకులు సంక్రాంతి సంబురాలను తిలకించేందుకు ఆంధ్రా ప్రాంతాలకు వెళ్లారు.

ఆంధ్రలో సంబురాలకు..

ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి సంబురాలు జోరుగా సాగుతాయి. అక్కడి ప్రజలకు ఇదే పెద్ద పండుగ. నెలరోజుల ముందు నుంచే పండుగ సందడి మొదలవుతుంది. పల్లెటూర్లు సైతం పండుగ కళతో కనిపిస్తాయి. ఇక సంక్రాంతి వేళ కోడిపందాలు ఆడటం అక్కడ ఆనవాయితీ. వీటిని తిలకిస్తూ సంక్రాంతిని ఆస్వాదించేందుకు జిల్లా నుంచీ ఆంధ్రాకు తరలివెళ్లారు. నాలుగైదు రోజులు అక్కడే ఉండి, చుట్టూ ఉండే ప్రముఖ క్షేత్రాలు, ప్రాంతాలనూ చూసివచ్చేలా ప్లాన్ చేసుకుని వెళ్లారు.

ప్రకృతి పండుగ..

సంక్రాంతిని ఉత్తరాయణగా కూడా పిలుస్తారు. ఎందుకంటే మకర సంక్రాంతి రోజు నుంచి సూర్యుడు ఉత్తరం వైపు పయనిస్తాడని చెబుతారు. ఈ సమయంలో దేశంలోని చాలా ప్రాంతాల్లో పంటలు చేతికొస్తాయి. అందుకే ఘనంగా వేడుకలు నిర్వహిస్తారు. జిల్లాలోనూ పండుగ సందడి రెండురోజుల ముందే మొదలైంది. చాలా గ్రామాల్లో యువజన, మహిళ సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఇక పతంగుల సందడి వారం నుంచే కొనసాగుతోంది. ఏ డాబాపై చూసిన చిన్నారులు గాలిపటాలను ఎగరేస్తూ కనిపిస్తున్నారు.



నిర్మల్ జిల్లా కేంద్రంలో భోగి వేడుకలు..

ఘనంగా గోదారంగనాథుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని బాగులవాడ వాల్మీకినగర్ రామాలయంలో శనివారం గోదారంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. పూజారులు రామకన్నన్, భాస్కరస్వామి కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణం తిలకించారు. పూజలు చేశారు. కల్యాణం అనంతరం అన్నదానం చేశారు. హనుమగౌడ్, జానకి, సురేందర్‌రావు, పరిమళ, హనుమంత్‌రెడ్డి, వసంత, రజిని, లింబయ్యవర్మ, సిండే గంగాధర్, పోశెట్టి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



స్వామివారి ఉత్సవ మూర్తులు..



వేడుకలు తిలకిస్తున్న భక్తులు

మంత్రికి శుభాకాంక్షల వెల్లువ



మంత్రికి శుభాకాంక్షలు చెబుతున్న డీఈవో

నిర్మల్ చైన్‌గేట్: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని శనివారం పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యాశాఖ తరఫున డీఈవో రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు సంఘ నాయకులు మంత్రిని కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనశాల విజయవంతానికి కృషి చేసిన మంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, సెక్టోరియల్ అధికారులు శ్రీదేవి, ఎన్.ప్రవీణ్‌కుమార్, డీఎస్ వో వినోద్‌కుమార్, తోట నరేంద్రబాబు, జుట్టు గజేందర్, మిట్టపెల్లి నర్సయ్య, భానుమూర్తి పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్మన్

మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ మంత్రిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేసి భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, ఎంపీపీ కోరిపెల్లి రామేశ్వర్‌రెడ్డి, దేవరకోట ఆలయ చైర్మన్ లింగంపల్లి లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు ఉన్నారు.

మంచినూనేనా..?



చిత్రంలో కనిపిస్తున్న వంటనూనె ప్యాకెట్ లీటరు పరిమాణంలో ఉండగా, అందులో అరలీటరు (550ఎంఎల్, మరో 165ఎంఎల్ అదనం) అని ప్యాకెట్‌పై ముద్రించి ఉంది. వాస్తవానికి బ్రాండెడ్ వంటనూనె లీటర్ ప్యాకెట్‌లో అంతే పరిమాణంలో నూనెను విక్రయిస్తాయి. కానీ కొన్ని లోకల్ బ్రాండెడ్ నూనె కంపెనీలు వినియోగదారులను మోసగించేలా అదనం అంటూ తూనికలు, కొలతల శాఖ నిబంధనలకు విరుద్ధంగా ప్యాకెట్లు ముద్రిస్తున్నాయి.

- మార్కెట్‌లో విచ్చలవిడిగా లోకల్‌బ్రాండ్లు
- ప్యాకింగ్, తూకాల్లోనూ మోసాలు
- పట్టించుకోని తూనికలు, కొలతల శాఖ

భైంసాటౌన్(ముధోల్): మార్కెట్‌లో పలు లోకల్ బ్రాండ్ వంటనూనెల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం సంక్రాంతి సమీపిస్తున్న నేపథ్యంలో పిండివంటల కోసం వంటనూనెల గిరాకీ ఉంటుంది. కాగా గ్రామీణప్రాంత నిరక్ష్యరాస్యులే లక్ష్యంగా కొన్ని లోకల్‌బ్రాండ్ వంటనూనె కంపెనీలు నాసిరకం నూనెలు విక్రయించడమే కాకుండా ప్యాకింగ్, తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నాయి. ఏది నాసిరకమో, ఏది నాణ్యమైనదో వినియోగదారులకు అవగాహన కల్పించడమే కాక అక్రమాలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

కామారెడ్డి, హైదరాబాద్ నుంచి...

జిల్లా కేంద్రమైన నిర్మల్‌తో పాటు డివిజన్ కేంద్రమైన భైంసాలో నిత్యావసరాలు, ఇతర సరుకుల కొనుగోలు కోసం గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో వస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా కిరాణ దుకాణాలు వందల సంఖ్యలో ఉన్నాయి. అయితే, వంటనూనెలకు సంబంధించి కామారెడ్డి, హైదరాబాద్, మహారాష్ట్ర నుంచి లోకల్ బ్రాండ్లు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. సన్‌ఫ్లవర్ బొమ్మ ఉన్న ప్యాకెట్లలో పామాయిల్, ఇతర నాసిరకం నూనెలు విక్రయిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. తూనికలు, కొలతల శాఖ నిబంధనలకు విరుద్ధంగా ప్యాకింగ్‌లో వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారు. గ్రామీణప్రాంత నిరక్షరాస్యులే లక్ష్యంగా తక్కువ తూకం ఉన్న ప్యాకెట్లు మార్కెట్‌లోకి తెస్తున్నాయి. దీంతో చాలామంది గ్రామీణ ప్రాంత వినియోగదారులు ధర తక్కువుందని నాసిరకం వంటనూనెలు వినియోగిస్తూ అనారోగ్యం బారిన పడుతున్నారు.

తూకం లేకుండానే డెలివరీ...

జిల్లా వ్యాప్తంగా పలు వంటగ్యాస్ ఏజెన్సీలు తూకంలో మోసాలకు పాల్పడుతున్నాయని వినియోగదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి తూనికలు, కొలతల శాఖ నిబంధనల ప్రకారం వినియోగదారులకు వంటగ్యాస్ డెలివరీ సమయంలో సిలిండర్ బరువు తూకం వేసి అందించాలి. కానీ జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఇలాంటి చర్యలు కనిపించడం లేదు. వంటగ్యాస్ సిలిండర్ వినియోగదారు వద్దకు చేరే ముందే సిలిండర్ నుంచి కొంతమొత్తంలో గ్యాస్ ఖాళీ చేసి కమర్షియల్‌కు విక్రయిస్తున్నారని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా డెలివరీ సమయంలో సర్వీస్ చార్జి నిబంధన లేకున్నా అదనంగా రూ.20 నుంచి రూ.30 వరకు వసూలు చేస్తున్నారు. ఇలా పలు గ్యాస్ ఏజెన్సీలు నిబంధలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా మారింది. సంబంధిత అధికారులు తనిఖీలు చేపడితే మోసాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని వినియోగదారులు అభిప్రాయపడుతున్నారు.



మార్కెట్‌లో వంటనూనెలు

ఇన్‌చార్జీలతోనే నెట్టుకొస్తున్న శాఖ...

వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడకుండా తరచూ తనిఖీలు నిర్వహించాల్సిన బాధ్యత తూనికలు, కొలతల శాఖపై ఉంది. ఈశాఖ ఆధ్వర్యంలో ఏటా ఎలక్ట్రానిక్, మాన్యువల్ కాంటాలకు స్టాంపింగ్ చేస్తారు. నిత్యావసర సరుకుల ప్యాకింగ్‌పై తయారీ, గడువు తేదీలు, ధర, సంప్రదించాల్సిన ఫోన్‌నం, తదితర వివరాలు తనిఖీ చేస్తారు. పెట్రోల్‌పంపులు, వేబ్రిడ్జిలు పరిశీలించి మోసాలకు పాల్పడకుండా చర్యలు తీసుకుంటారు. కాగా జిల్లాలో తూనికలు, కొలతల శాఖకు రెగ్యులర్ అధికారి లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మూడేసి జిల్లాల బాధ్యతలు ఉండడంతో అధికారులు సక్రమంగా తనిఖీలు చేపట్టలేకపోతున్నారు.

అవగాహన కల్పించాలి

మార్కెట్‌లో ఏది మంచినూనెనో, ఏది నాసిరకమో మాలాంటి వాళ్లకు ఏం తెలుస్తుంది. అధికారులు దుకాణాల్లో తనిఖీలు చేసి శాంపిళ్లు సేకరించి, వినియోగదారులకు అవగాహన కల్పించాలి. వినియోగదారులు మోసపోకుండా చూడాలి.

– సవిత, గృహిణి, భైంసా

తనిఖీలు చేపడతాం

వ్యాపారులు తప్పనిసరిగా తూనికలు, కొలతల శాఖ నిబంధనలు పాటించాలి. వస్తువుల ప్యాకింగ్‌పై తయారీ, గడువు తేదీలతో పాటు ధర, ఫిర్యాదులకు సంప్రదించాల్సిన నంబర్, ఇతర వివరాలు ముద్రించి ఉండేలా చూడాలి. వినియోగదారులు మోసాలకు గురైతే సమాచారమందించాలి. తూకాల్లో మోసాలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– భూలక్ష్మి, ఇన్‌చార్జి డీఎల్‌ఎంవో, నిర్మల్

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


గాయపడిన అబ్దుల్ రషీద్

ముథోల్: మండల కేంద్రంలోని కంటి దవాఖాన సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. భైంసా పట్టణానికి చెందిన అబ్దుల్ రషీద్ భైంసా నుంచి ద్విచక్రవాహనంపై ముథోల్ వైపు వెళ్తుండగా భైంసా నుంచి ముథోల్‌కు వస్తున్న ఆటో కంటి దవాఖాన వద్ద ఢీ కొట్టింది. దీంతో రషీద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించారు.

బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్


మాట్లాడుతున్న పట్టణ సిఐ శ్రీనివాస్

నిర్మల్‌చైన్‌గేట్: గుట్టు చప్పుడు కాకుండా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరిని నిర్మల్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ పట్టణంలోని సోమవార్‌పేట్ కాలనీకి చెందిన మహమ్మద్ అబ్దుల్ నోమన్ అలియాస్ రమీజ్ కొంతకాలంగా బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. పక్కా సమాచారంతో పోలీసులు సోదాలు నిర్వహించి అతడిని పట్టుకున్నారు. రమీజ్ బ్యాంకు అకౌంటు, ఫోన్‌ను స్వాధీనం చేసుకుని విచారణ చేయగా నిర్మల్ పట్టణానికి చెందిన సల్మాన్, భైంసాకి చెందిన దత్తు, అనీస్ ఇర్ఫాన్ సహకారంతో క్రికెట్, ఇతర ఆటలపై బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపాడు. దీంతో మహమ్మద్ అబ్దుల్ నోమన్ అలియాస్ రమీజ్, సల్మాన్ భైంసాకు చెందిన దత్తు, అనీస్, ఇర్ఫాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎదురొస్తున్న ప్రమాదం..!

- ఎదురెదురుగా ఢీకొంటున్న ద్విచక్ర వాహనాలు
- వేగం వల్ల గాల్లో కలుస్తున్న ప్రాణాలు


భీంపూర్ మండలం లక్ష్మీపూర్ వద్ద జరిగిన ప్రమాద స్థలంలో క్షతగాత్రులు(ఫైల్)

సాక్షి, మంచిర్యాలడెస్క్: ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారికి ప్రమాదం ఎదురొస్తోంది. అతివేగం, మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం, నిబంధనలు పాటించకపోవడం వల్ల ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొట్టుకోవడంతో ప్రమాద తీవ్రత పెరుగుతోంది. గత డిసెంబర్ 25న ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం హస్నాపూర్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో నలుగురు సంఘటన స్థలంలోనే మృత్యువాత పడడం, మరొకరు ఆస్పత్రిలో చనిపోవడం తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ ప్రమాదాల్లో మృతుల సంఖ్యతోపాటు గాయపడుతున్న వారూ అధికంగానే ఉంటున్నారు.

హెల్మెట్ వినియోగంపై నిర్లక్ష్యం..

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనల్లో చాలామంది హెల్మెట్ లేకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోవడం, తీవ్రంగా గాయపడడం జరిగింది. రాంగ్‌రూట్‌లో వెళ్లడం, మూలమలుపులు, మద్యపానం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మంచిర్యాల జిల్లాలో గత ఏడాది కాలంలో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న 3,288మందికి పోలీసులు జరిమానా విధించారు. రూ.4.81లక్షలు జరిమానా రూపంలో వసూలైంది. నిర్మల్ జిల్లాలో హెల్మెట్ లేకుండా ప్రయాణించిన 1,49,621 మందికి రూ.2,24,43,150 జరిమానా విధించారు. ఆదిలాబాద్ జిల్లాలో 2,307 మందికి జరిమానా విధించి రూ.1,17,232 వసూలు చేశారు. జిల్లాలో పోలీసులు 13బ్లాక్‌స్పాట్లు గుర్తించారు. నేరడిగొండ మండలం కుప్టి, నేరడిగొండ సమీపంలోని దాబాల వద్ద, ఇచ్చోడ, ఇంద్రవెల్లి మండలం పులిమడుగు, జైనథ్ మండలం భోరజ్, మావల సమీపంలోని బైపాస్, దేవాపూర్ చెక్‌పోస్టు తదితర ప్రాంతాలు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో కొన్ని ఘటనలు..

- మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై గత జూలై 11న రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. హాజీపూర్ గ్రామానికి చెందిన మల్యాల వంశీ(20) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. హెల్మెట్ లేకపోవడం వల్ల ఈ ప్రమాదంలో వంశీ మృతిచెందినట్లు తెలుస్తోంది. ఇదే ప్రమాదంలో మరో ద్విచక్ర వాహనంపై ఉన్న యువకులు చింతకింది శ్రీధర్, అలిశెట్టి రవిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరు హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందినవారు.
- తాంసి మండలం హస్నాపూర్ గ్రామ సమీపంలో డిసెంబర్ 25న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఘటన స్థలంలోనే నలుగురు మృతిచెందారు.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.. సుజీత్‌రామ్(38), మనీషా(11), నారాయణ(30), సంస్కార్(11) మృతిచెందారు. వందన అనే మహిళ గాయపడింది. ఈ ప్రమాదంలో బైక్ ప్రయాణిస్తున్న వారు హెల్మెట్లు ధరించలేదు.
- జనవరి 9న భీంపూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. గుబిడిపల్లెకు చెందిన చిర్ర మల్లన్న, రాజారాం, మహారాష్ట్రలోని కొఠారికి చెందిన రంజిత్ చౌహాన్, రమేష్‌యాదవ్ గాయపడ్డారు.
- జనవరి 9న ముథోల్ మండలం టాక్లి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనగా నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం యంచ గ్రామానికి చెందిన సాయిలు(35) అక్కడికక్కడే మృతిచెందాడు. నవీపేట మండలం బినోల గ్రామానికి చెందిన రాజశేఖర్ గాయపడ్డాడు.
- ఆదిలాబాద్ రూరల్ మండలం బంగారుగూడ సమీపంలో గత ఏడాది ఫిబ్రవరి 28న రెండు ద్విచక్ర వాహనాల ఎదురెదురుగా ఢీకొని గుండవేణి ప్రసాద్ గాయపడ్డాడు. అక్టోబర్ 20న రాంపూర్ సమీపంలో జరిగిన ప్రమాదంలో కాల్వ మల్లేష్ గాయపడ్డాడు. మే 20న జరిగిన ప్రమాదంలో షేక్ ఆరీఫ్(50) మృతిచెందాడు. వీరి వాహనాలకు ఎదురుగా వాహనాలపై వచ్చిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.
- జనవరి 10న మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురెదురుగా ఢీకొన్నాయి. వాహనాలపై ఎదురెదురుగా వస్తున్న బాసర గ్రామానికి చెందిన శివ తీవ్రంగా, మహారాష్ట్రకు చెందిన సంక్షేణ స్వల్పంగా గాయపడ్డారు.

హెల్మెట్ ధరించి నిబంధనలు పాటించాలి



మానవ తప్పిదాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. యువత చైతన్యంతో నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలు నివారించవచ్చు. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, మితిమీరిన వేగం, నిబంధనలు పాటించకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికే పోలీసు, రవాణా శాఖల సమన్వయంతో రెడ్‌జోన్, బ్లాక్‌స్పాట్స్ గుర్తించడంతోపాటు మూలమలుపులు, ఇరుకు వంతెనల వద్ద జాగ్రత్తలు సూచించాం. వాహనదారులు జాగ్రత్తలు పాటించడంలో నిర్లక్ష్యంగా వ్యహరిస్తూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల విషయంలో జాగ్రత్తలు సూచించాలి. ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనల్లో హెల్మెట్ లేని కారణంగా మృత్యువాత పడుతున్నారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయకుండా హెల్మెట్ ధరించి రోడ్డు నిబంధనలు పాటించాలి.

– ఎల్.కిష్టయ్య, జిల్లా రవాణాశాఖా అధికారి, మంచిర్యాల

ప్రమాదాల నివారణకు చర్యలు



రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నాం. ద్విచక్ర వాహనాలతోనే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలు నడిపిస్తుండడంతో ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రివేళల్లో గుర్తించేలా ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల వెనుక రేడియం వేయించేలా చూస్తున్నాం. ఆదిలాబాద్ పట్టణంలో రోడ్లపై పశువుల సంచారంతో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. గత పది రోజుల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడంతో ప్రమాదాలు జరగడలేదు. నిబంధనలు పాటించని 300 మందిపై కేసులు నమోదు చేశాం. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా చూడాలి.

– డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ

బామ్ని(కె)కు చేరిన మృత దేహం

లోకేశ్వరం: మండలంలోని బామ్నికే గ్రామానికి చెందిన గొల్ల రాజు(39)అబదాబిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని శనివారం స్వగ్రామానికి తీసుకువచ్చారు. గొల్ల రాజును విగతజీవిగా చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు. రాజుకు భార్య చిన్నక్క, కుమారుడు రేవంత్ ఉన్నారు.

కడెంలో పర్యాటకుల సందడి


బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

కడెం: సంక్రాంతి సెలవులతో కడెం ప్రాజెక్ట్ పరిసరాలు శనివారం పర్యాటకులతో సందడిగా మారాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు కుటుంబ సభ్యులతో కలిసి ప్రాజెక్ట్ అందాలను వీక్షించి, బోటింగ్ చేస్తూ ఉల్లాసంగా గడిపారు.

హరిహర క్షేత్రంలో మకర జ్యోతి దర్శనం




పూజలు చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి


దీపాలు వెలిగిస్తున్న మహిళలు

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని మల్లన్నగుట్ట హరిహర క్షేత్రంలో శనివారం అయ్యప్ప మకర జ్యోతి దర్శనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం అయ్యప్పస్వామి తిరు ఆభరణాలను మేళతాళాల మధ్య భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో తిరు ఆభరణాలకు స్వాగతం పలికారు. అనంతరం అయ్యప్ప ఆలయం వద్ద ఉత్సవ విగ్రహాలు, మూల విరాట్టును ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మకరజ్యోతి దర్శనం గావించారు. భక్తుల శరణుగోషతో మల్లన్నగుట్ట మార్మోగింది. కార్యక్రమంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త అల్లోల వినోద మురళీధర్ రెడ్డి, గురుస్వాములు, అర్చకులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి వాసికి అవార్డు


అవార్డు స్వీకరిస్తున్న కుమారస్వామి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ రడగంబాల బస్తీకి చెందిన దుర్గం కుమారస్వామిని ఇంటర్నేషనల్ అకాడమిక్ ఎక్స్‌లెంట్–22 అవార్డు వరించింది. హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న కుమారస్వామి ఇంజనీరింగ్ విద్యలో విద్యార్థులకు అందించిన సేవలు, వివిధ జర్నల్స్‌లో ప్రచురితమైన ఆర్టికల్స్‌కు గాను నీతి అయోగ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్‌ఎంఈ ఆధ్వర్యంలో అవార్డును ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం అవార్డు, మెడల్ ను కుమారస్వామి అందుకున్నారు. కుమారస్వామిని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు

లోకేశ్వరం: వారంత ఒకేచోట చదువుకున్న విద్యార్థులు. తరగతిలో పోటీపడి చదివారు. మైదానంలో నువ్వా నేనా అంటూ క్రీడాల్లో పాల్గొన్నారు. చిలిపి చేష్టలతో గురువుగారి బెత్తం దెబ్బలు తిన్నారు. స్థాయి అంతరాల్లో తేడా ఉండొచ్చు, ఉద్యోగ, జీవన విధానాల్లో వ్యత్యాసం ఉండొచ్చు. తమను ఉన్నత స్థితికి చేర్చి తమ జీవితానికి పునాది వేసిన గురువులను గుర్తు చేసుకునేందుకు శనివారం ఒక్కచోటకు చేరారు. ఇందుకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికైంది. పాఠశాలలో 2005–06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులను సన్మానించారు.

16న రాష్ట్రస్థాయి సమావేశం

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ పర్థాన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం ఈనెల 16న ఉట్నూర్‌లో నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉన్నత స్థాయి ఉద్యోగులు, హైదరాబాద్, కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, నిజామబాద్, జిల్లాల నుంచి హాజరవుతారని, పర్థాన్ ఉద్యోగుల సంఘం బలోపేతం చేయడం, భవిష్యత్‌లో సంఘం నిర్వహించే కార్యక్రమాలు, సమాజానికి చేయాల్సిన సేవ, ముఖ్యమైన ఏజెండాతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని ధర్‌లొద్ది గ్రామానికి చెందిన వివాహిత పార్వతి బాయి(23) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. స్థానికుల కథనం ప్రకారం.. పార్వతి బాయి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించగా ఈఎంటీ కార్తీక్‌సింగ్, పైలేట్ రాములు ప్రథమ చికిత్స అనంతరం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

భీమారంలో డిగ్రీ విద్యార్థి..



భీమారం: మండల కేంద్రానికి చెందిన డిగ్రీ విద్యార్థి చింతపూడి అంజి(20) శనివారం మధ్యాహ్నం ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇంట్లో గొడవపడి అకస్మాత్తుగా క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు స్పందించి పురుగుల మందు బయటకు వచ్చేలా సర్ఫ్ నీళ్లు తాగించారు. అంతరం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు.

వివాహిత బలవన్మరణం


సాయి వినూత్న (ఫైల్)

నస్పూర్: పట్టణ పరిధిలోని ఫ్లడ్ కాలనీకి చెందిన వివాహిత సాయివినూత్న (22) బలవన్మరణానికి పాల్పడింది. సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫ్లడ్ కాలనీకి చెందిన సాయి వినూత్నకు దేవాపూర్‌కు చెందిన సాయితో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. కొద్దికాలం తర్వాత భార్యాభర్తలకు తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో ఇరు కుటుంబాల అంగీకారంతో గత నవంబర్‌లో విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. కొంతకాలంగా సాయి వినూత్న ఇంట్లో ఒంటరిగా, ముభావంగా ఉంటోంది. ఈ క్రమంలో శనివారం ఇంట్లోని బెడ్‌రూంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందిందని వైద్యులు తెలిపారు. మృతురాలి తండ్రి వినోద్‌శర్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూస్తాం..

దండేపల్లి: వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూస్తామని విద్యుత్ డీఈ కైసర్, ఏడీఈ ప్రభాకర్ తెలిపారు. విద్యుత్ అంతరాయంతో దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్ శివారులో పొలాలు ఎండిపోవడంతో 'పొలాలు బీటలు' అనే శీర్షికన 'సాక్షి'లో శని వారం కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. బీటలు వారిన పొలాలను పరిశీలించారు. రైతులు, విద్యుత్ సిబ్బందితో మాట్లాడారు. విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు రైతులు సిబ్బంది దృష్టికి తేవాలన్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి సమస్యలు తలెత్తినప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఏఈ ఈరాయనర్సు, లైన్‌మెన్ రామస్వామి, జేఎల్‌ఎం రాజలింగు తదితరులు పాల్గొన్నారు.